



# నేడు మంత్రి వర్గ విస్తరణ



● కవ్వంపల్లి, అడ్లూరిలో ఒకరికి అవకాశం ● రేసులో ఆది శ్రీనివాస్ కూడా..

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆదివారం మధ్యాహ్నం కొత్త మంత్రులు ప్రమాణం చేయనున్నట్లు తెలిసింది. ఈసారి మంత్రి వర్గంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల్లో ఒక్కరికి అవకాశం లభించనున్నట్లు సమాచారం. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, బీసీ సామాజిక వర్గానికి చెందిన వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రేసులో ఉన్నట్లు తెలిసింది. ఆదివారం మధ్యాహ్నం వరకు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. - ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

7

# ఘనంగా బక్రీద్

సాలెహ్‌నగర్ ఈద్గా వద్ద మత పెద్ద సందేశాన్ని వింటున్న ముస్లింలు





**ఈద్గాలు, మసీదుల్లో ప్రార్థనలు**

కరీంనగర్ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భక్తి విశ్వాసాలు, త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్‌ను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మసీద్‌లు, ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ప్రార్థనలు చేయించి, సందేశమిచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది సేవలందించారు. బైపాస్‌రోడ్‌లోని ఈద్గా అహ్మద్‌లో జమీయత్ ఐలే హదీస్ షహరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మొహమ్మద్ యూసుఫ్ సందేశం ఇవ్వగా, మొహమ్మద్ యూనుస్ మదనీ నమాజ్ చేయించారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ ఇస్మాయిల్ శుభాకాంక్షలు తెలిపారు. చింతకుంట ఈద్గాలో ముఫ్తి ఎత్తెమాదుల్ హక్ నమాజ్ చేయించగా షోయబ్ అహ్మ ద్‌ఖాన్ సందేశమిచ్చారు. సాలెహ్‌నగర్ ఈద్గాలో ముఫ్తీ మహమ్మద్ షియాస్ మొహియొద్దీన్ సందేశమివ్వగా, కరీంనగర్ సదర్ ఖాజీ, మన్ ఖబత్ షా ఖాన్ నమాజ్ చేయించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద గల పురానీ (ఖదీమ్‌షాహి) ఈద్గాలో హాఫీజ్ సయ్యద్ షా మొహమ్మద్ ఖాద్రి సందేశమిచ్చి నమాజ్ చేయించారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

**కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్**



ఖాజీపూర్‌లో సీసీ రోడ్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కొత్తపల్లి మండలంలోని బావుపేట ఆసిఫ్‌నగర్, ఖాజీపూర్, కొత్తపల్లిలో పలు అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 31 కోట్ల రూపాయల ఉపాధిహామీ నిధులతో రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. సీఆర్ఐఎఫ్ నిధు లతో 1,314 కిలోమీటర్ల పరిధిలో రోడ్లను విస్తరించామన్నారు. కరీనగర్- జగిత్యాల రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నేషనల్ హైవే నిధులతో రాజీవ్ రహదారిని విస్తరించేందుకు కేంద్రం సిద్ధంగాఉందన్నారు. పీఎంజీ ఎస్‌వై కింద మారుమూల గ్రామాల్లో రోడ్లను నిర్మించామన్నారు. కొత్తపల్లిలోని ఖాజీపూర్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 14 లక్షల రూపాయలతో చేపట్టిన రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్‌నగర్‌లో 9.5 లక్షల రూపాయల ఎంపీ ల్యాడ్స్ నిధులతో మార్కెట్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్ర మంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుంట తిరుపతి, మండల మాజీ అధ్య క్షుడు కడార్ల రతన్‌కుమార్, కోమటిరెడ్డి అంజన్‌కుమార్, జవ్వాజి రమేష్, కట్ల శ్రీనివాస్, కడారి శ్రీనివాస్, సోమినేని కరుణాకర్, మల్లేశం, ఇల్లందుల ఆనంద్, భైరెడ్డి వంశీ, బోనాల నరేష్ పాల్గొన్నారు.

## నేటి నుంచి మృగశిర

● రైతులకు అనుకూలం... ● వ్యవసాయ పనులు ప్రారంభం



టవర్‌సర్కిల్‌లో చేప మందు పంపిణీ కార్యక్రమం

కరీంనగర్ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రోళ్లు పగిలే ఎండలు దడ పుట్టించి తమ ప్రతాపాన్ని చూపాయి. రోహిణి కార్తి పోయి పలు ప్రయోజనాలతో కూడిన మృగశిర కార్తి ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. ఇది రైతులకు అనుకూల కార్తి. విత్తనాలు విత్తి పొలం పనులు ప్రారంభిం చుకునేందుకు ఈ కార్తి అనుకూలంగా ఉంటుంది. రైతులు ప్రతియేటా మృగశిర కార్తి కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తుంటారు. మాంసాహారులు ఇదే కార్తి ప్రారంభం రోజు నుంచి ఆర్ద్ర ప్రారంభమయ్యేవరకు ఎవరి వీలునుబట్టి వారు చేపలు తినడం ఆనవాయితీగా వస్తుంది. అస్తమా, ఉబ్బసానికి చేప మందు ఇదే కార్తిలో అందిస్తుంటారు.

● **ఆధ్యాత్మిక నేపథ్యం..:** మృగశిర కార్తినాడు రంభా తృతీయ అవుతుంది. రంభాఫలం అంటే అరటిపండు. ఈ కార్తిలో అరటి చెట్లను పూజించాలని, అరటిపండ్లు, తమలపాకులు, వక్కలు దానం చేయాలని శాస్త్రం చెబుతోంది.

● **జనాలతో కళకళలాడుతున్న మార్కెట్లు..:** చేపమందు, చేపలు తినాలనడంతో నాలుగైదు రోజుల ముందు నుంచే జిల్లా కేంద్రంలోని, నగర శివారులోగల చేపల మార్కెట్లు జనాలతో కళకళలాడుతున్నాయి. మరోవైపు గ్రామాల్లోని చెరువుల్లో చేపలను పట్టి తిరుగుతూ అమ్ముతున్నారు. ధరలు పెరిగినా వినియోగదారులు కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. వ్యాపారులు సెంటిమెంట్‌ను క్యాచ్‌చేసి క్యాష్ చేసుకుంటున్నారు. మామూలు రోజుల కంటే చేపలకు ధరలు పెరిగాయి.

# ఇంకెన్నాళ్లు?

● ఏడేళ్లుగా కొనసాగుతున్న మానకొండూర్-జమ్మికుంట రోడ్డు నిర్మాణ పనులు
● పూర్తి కాని లో లెవల్ బ్రిడ్జిలు
● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు



అన్నారంలో పూర్తి కాని తారు రోడ్డు

మానకొండూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్-జమ్మికుంట రోడ్డు నిర్మాణాన్ని ఏడేళ్ల క్రితం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 70 కోట్ల రూపాయలతో ప్రారంభించింది. మానకొండూర్ గ్రామ పంచాయతీ నుంచి మార్కెట్, మసీదు మీదుగా తూర్పు దర్వాజ బస్టాండ్ నుంచి జమ్మికుంట వరకు కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాడు. మానకొండూర్, రాఘవాపూర్, అన్నారం, లలితాపూర్, దేవంపల్లి, రంగపేట, పోచంపల్లి, పచ్చునూర్ వరకు సబ్ కాంట్రాక్టర్ పనులను చేపట్టాడు. జమ్మికుంట నుంచి వీణవంక మండలంలోని మామిడాలపల్లి వరకు మరో సబ్ కాంట్రాక్టర్ పనులు చేపట్టారు.

అప్పటి హుజురాబాద్ ఎమ్మెల్యే మాజీ మంత్రి ఈటల రాజేందర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వీణవంక మండలంలోని మామిడాలపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. పచ్చునూర్ నుంచి మానకొండూర్ వరకు ఆయా గ్రామాల ప్రజల ఆందోళనలతో అరకొర పనులు చేయడానికి సుమారు ఆరేళ్లు పట్టింది. అన్నారం నుంచి మానకొండూర్ వరకు తారు రోడ్డు లేక ఆరేళ్లు దుమ్ముతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు.

**ఇష్టారాజ్యంగా పనులు**

మానకొండూర్, అన్నారం గ్రామాల్లో రోడ్డు వెడెల్పు పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. ఈ రెండు గ్రామాలతో పాటు రాఘవాపూర్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టాలని అనేక మార్లు ఆయా గ్రామాల ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను అడ్డుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ గ్రామాల్లో ఆదరబాదరగా తారు రోడ్డు నిర్మించారు. పూర్తిస్థాయిలో డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురికి నీరు ఎక్కడిక్కడే నిలిచిపోతోంది. లలితాపూర్, అన్నారం, మానకొండూర్ గ్రామాలలోని లో లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో పాటు ఇరువైపులావంద మీటర్ల వరకు తారు రోడ్డు వేయలేదు.

దీంతో ఆర్టీసీ బస్సులు, ఇసుక లారీలు వెళ్లే సమయంలో దుమ్ము లేచి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడడమే కాకుండా ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఏడేళ్లుగా వర్షాకాలంలో కురిసే వర్షాలతో ఎగువ భాగాన నుంచి వచ్చే వరదలో లెవల్ బ్రిడ్జిపై నుంచి ప్రహించడంతో రాకపోకలు నిలిచిన సంఘటనలు ఉన్నాయి. అన్నారంలో నెల రోజుల క్రితంలో లెవల్ బ్రిడ్జికి ఇరువైపులా పైపులు వేసి మధ్యలో వదిలిపెట్టారు. మానకొండూర్‌లో పూర్తిస్థాయిలో పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టి తారు రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలతో ప్రయాణికులు కోరుతున్నారు.



అసంపూర్తిగా లో లెవల్ బ్రిడ్జి

## వరుణుడి కోసం పత్తి రైతుల ఎదురుచూపులు



హుజూరాబాద్ మండలం కాట్రపల్లిలో విత్తనాలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్న భూమి

హుజూరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఈసారి వర్షాలు ముందుగా కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీనికి తగ్గట్లు మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో రైతులు హుజూరాబాద్ డివిజన్‌లో పత్తి సాగు చేసే రైతులు దుక్కులు దున్ని, అచ్చుతోలి భూములను సిద్ధం చేసుకున్నారు. వర్షం కురిస్తే విత్తనాలు వేయాలని ఎదురుచూస్తున్నారు. గత సంవత్సరం ముందుగా పత్తి సాగు చేసిన రైతులకు దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. దీంతో పత్తి సాగును ముందుగా చేపట్టాలని రైతులు బావిస్తున్నారు. డివిజన్‌లోని జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాలు ఉన్నాయి. 120లక్షల ఎకరాల్లో సాగు భూమి ఉంది. అందులో 20వేల ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేస్తారు. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాల్‌కు 589 రూపాయలు పెంచడంతో పత్తి సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

**వర్షాలు పడితే విత్తనాలు వేస్తాం: తొగరు స్వామి, రైతు, కాట్రపల్లి**

ఇటీవల కురిసిన వర్షాలకు దుక్కులు దున్నాం. వర్షాలు కురిస్తే పత్తి విత్తనాలు పెట్టేందుకు సిద్ధం ఉన్నాం. గత సంవత్సరం ముందుగా విత్తనాలు విత్తడం వల్ల అధిక దిగుబడి వచ్చింది. పత్తి విత్తనాలను సైతం ఎరువుల దుకాణాల్లో కొనుగోలు చేశాం.







# ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

● మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి ● సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

గణేశ్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ, సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో వారు నల్ల జెండాలు పట్టుకుని శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి మూడోసారి వచ్చిన తర్వాత మావోయిస్టులను హతమార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామంటూ డెడ్‌లైన్ విధించడం పాలకుల రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. మావోలకు మద్దతుగా ఉంటున్నారని నెపంతో అమాయక ఆదివాసీల ప్రాణాలను బలి కొంటుందని విమర్శించారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును మేధావులు, ప్రజలు ప్రజా సంఘాలు ముందుకు వచ్చి వ్యతిరేకించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మొన్న పాకిస్తాన్‌తో చర్చలు జరిపినప్పుడు భారతదేశంలో ఉండి పేద ప్రజల కోసం, సమా నత్వం కోసం పోరాడుతున్న మావోయిస్టులతో ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు. చర్చలకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు చెబుతున్నా కేంద్రం స్పందించపోవడం సిగ్గుచేటన్నారు.

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మావోయిస్టులను అంతం చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నాడన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో చర్చలు జరపాలని లేకుంటే వామ పక్షాల ఆధ్వర్యంలో రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుడికందుల సత్యం, గిట్ల ముకుందరెడ్డి సీపీఐ, సీపీఎం జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు కిన్నెర మల్లమ్మ, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ఎడ్ల రమేష్, కోనేటి నాగమణి, మచ్చ రమేష్ బ్రాహ్మణపల్లి యుగంధర్, కొట్టే అంజలి, జి తిరుపతి, గజ్జల శ్రీకాంత్, కాంపల్లి అరవింద్, సత్తయ్య, మురళి, నగునూరు రమేష్, కనకరాజు, సాగర్, తిరుమలయ్య, పవన్ కండిరాజు, సందేశ్, అక్షయ్ పాల్గొన్నారు.



నల్ల జెండాలు పట్టుకుని నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం జిల్లా నేతలు

# ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు



మార్కెట్ రోడ్డులో వాహనదారుల ఇబ్బందులు

జమ్మికుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధి చెందిన జమ్మికుంటకు పాత కూరగాయల మార్కెట్ దారి వాహనదారులకు నరక యాతన చూపిస్తోంది. ఏదైనా భారీ వాహనం ఎదురుగా వస్తే అంతే సంగతులు. 15 నుంచి 20నిమిషాల పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కు పోవాల్సిందే. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారులు 30 ఫీట్లకు పైగా ఉన్నాయి. ఓల్డ్ వెజిటేబుల్ మార్కెట్ రోడ్ 16ఫీట్ల వెడల్పు మాత్రమే ఉంది. దీంతో రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. కోరపల్లి, విలాసాగర్, పోతిరెడ్డిపల్లి, బిజిగిరి షరీఫ్ గ్రామాలకు వెళ్లాలంటే ఆ రోడ్డు మీదుగానే వెళ్లాలి. నూతన వ్యవసాయ మార్కెట్, స్టేట్ వేర్ హౌస్ గోదాములు, ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), ధాన్యం, కాటన్ ఇండస్ట్రీలు అటువైపే ఉండటంతో నిత్యం ఆ రోడ్డు మీదుగా భారీ వాహనాలు వెళుతుంటాయి. మానేరు పరివాహక ప్రాంతాలైన విలాసాగర్, పోతిరెడ్డిపేట, గంగ్రపల్లి, తనుగుల గ్రామాలు అటువైపు ఉండడంతో ఇసుక ట్రాక్టర్లు కూడా ఆ మార్గం ద్వారా జమ్మికుంటకు రావాల్సి ఉంటుంది.

**బైపాస్ గుండా భారీ వాహనాలు..**

జమ్మికుంటలోని ఓల్డ్ వెజిటేబుల్ మార్కెట్ దారి ఇరుకుగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని పట్టణ ప్రజలు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. స్పందించిన పోలీస్ అధికారులు కొద్ది సంవత్సరాల క్రితం భారీ వాహనాలను బైపాస్ మీదుగా మళ్లించారు. బైపాస్ మార్గం నుంచి దూరం అవుతుందని బావించిన భారీ వాహనదారుల డ్రైవర్లు మళ్లీ ఇదే దారిని ఎంచుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పోలీస్ అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పాత కూరగాయల మార్కెట్ ఇరుకు రోడ్డులో వస్తున్న భారీ వాహనం

## అప్పుల బాధతో ఉరివేసుకొని బలవన్మరణం


కృష్ణ(ఫైల్)

ముస్తాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పెరుమాండ్ల కృష్ణ(50) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం... పెరుమాండ్ల కృష్ణ నాలుగేళ్ల క్రితం తన కూతురు పెళ్లి కోసం రూ.4 లక్షల అప్పు చేశాడు. ఉపాధికరువై అప్పులు ఎలా తీర్చాలని బాధపడుతుండేవాడు. ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపైనుంచి కిందపడి పోయాడు. దీంతో చేయికి తీవ్రగాయమైంది. అప్పులతో పాటు అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెందిన కృష్ణ తెర్లుమద్ది శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పెరుమాండ్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


లలిత(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన నేవూరి లలిత(50) అనుమానాస్పద స్థితిలో మృతిచెందిందని ఎస్‌ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. ఆయనకథనం మేరకు.. గ్రామంలో లలిత కొంతకాలంగా మధుమేహం, బీపీ వ్యాధితో బాధపడుతోంది. ఆమె కొడుకు కళ్యాణ్, కోడలు స్థానికంగా నిర్వహిస్తున్న కిరాణా దుకాణాన్ని ఈనెల6న రాత్రి మూసి వేసి ఇంటికి చేరుకున్నారు. లలిత విరేచనాలు చేసుకుని కింద పడిపోయింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో సిరిసిల్లకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే లలిత మృతిచెందిందని నిర్ధారించారు. మృతురాలు కొడుకు కళ్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు. మృతురాలికి భర్త అశోక్‌రెడ్డి, కొడుకు కల్యాణ్, కూతురు కవితలు ఉన్నారు.

## జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

కోల్‌సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అడ్డగుంటపల్లికి చెందిన దుర్శెటి కుమార్(34) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఇంటి తలుపులు తెరిచి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అవివాహితుడైన కుమార్ కూలీ చేసుకుంటూ జీవిస్తున్నాడు. తల్లిదండ్రులు చాలా కాలం క్రితమే మృతి చెందారు. ఒంటరితనంతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడని, ఇంటికివచ్చే కిరాయి డబ్బులతో జీవనం సాగించేవాడని పోలీసులు పేర్కొన్నారు. అతని సోదరి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ వెల్ఫేర్ కాంప్లెక్స్ షాప్ నంబరు 9 వద్ద శనివారం 55 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందని పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి చిరునామా లభించలేదని, మృతదేహాన్ని ప్రభు త్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని పేర్కొన్నారు. గుర్తించినవారు ప్రభుత్వాస్పత్రిలోని అవుట్‌పోస్ట్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## పోగొట్టుకున్న మెడికల్ డాక్యుమెంట్స్ అప్పగింత

కరీంనగర్ క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఒక మహిళా మెడికల్ డాక్యుమెంట్స్, కొంత నగదుతో కూడిన కవర్ బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోగా పోలీసులు ఆమెకు అప్పగించారు. శనివారం ఉదయం ఓమహిళ బస్టాండ్‌నుంచి ఆటోలో ప్రశాంత్ నగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చింది. ఆటో దిగి లోపలికి వెళ్లి చూసుకునేసరికి మెడిసిన్ డాక్యుమెంట్లు, నగదు కవర్ కనపడలేదు. వెంటనే డయల్ 100కు కాల్ చేసింది. కంట్రోల్‌రూం నుంచి కరీంనగర్ మూడో టౌన్ పరిధిలోని బ్లూకోల్ట్స్ పోలీసులను అప్రమత్తం చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసులు ఆటో డ్రైవర్లను ఆరాతీయగా ఒకఆటోలో కవర్ లభ్యమైంది. ఆ కవరన్‌ను భద్రంగా బాధిత మహిళకు అప్పగించారు.

# స్కాన్ చేసి.. అభిప్రాయం చెప్పండి

- పోలీస్‌ల పనితీరుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ
- ఐదు రకాల సేవలకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ యాప్
- అన్ని పోలీస్ స్టేషన్లలో అందుబాటులో క్యూఆర్ కోడ్ పోస్టర్లు
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యం
- అవార్డు అందుకున్న ఇబ్రహీంపట్నం, మేడిపల్లి ఎస్‌ఐలు



మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో అతికించిన సిటిజన్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్

**ఐదు రకాల సేవలపై అభిప్రాయం..**

ప్రధానంగా తెలంగాణ పోలీస్ సేవలపై ప్రభుత్వం దృష్టి సారించి వారు ప్రజలకు ఏ విధానమైన సేవలు అందిస్తున్నారనేది తెలుసుకునేందుకు ఠాణాకు వచ్చిన ప్రజలు ఐదు రకాల సేవలపై క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి అభిప్రాయం తెలుపవచ్చు. ఇందులో ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, ఈ చాలన్, పాస్ పోర్ట్ ధ్రువీకరణ, ఇతర అంశాలు అంటూ ఐదు రకాల సేవలపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. జిల్లాలో ఉన్న పోలీస్ స్టేషన్ల నుంచి ఇప్పటి వరకు ప్రజలు వివిధ రకాలు సమస్యలు, పోలీస్‌ల పనితీరుపై క్యూఆర్ కోడ్‌కు పోస్ట్‌లు చేశారు. వీటిలో దాదాపుగా అధికారులు పనితీరులో వారు అందిస్తున్న సేవల్లో అభినందనీయంగానే వచ్చినట్లు తెలిసింది.

మెట్‌పల్లి టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కావడం లేదా.. ఫిర్యాదుకు సరైన విధంగా స్పందించడం లేదా.. పోలీస్‌లు సమస్యలు వెంటనే పరిష్కరించి సత్వర న్యాయం చేశారా.. ఇలా పోలీస్ స్టేషన్‌లో ఎదురైన సంఘటనలకు ఫీడ్ బ్యాక్ అందించేందుకు ప్రభుత్వం పోలీస్‌ల పనితీరు తెలుసుకు నేందుకు సిటిజన్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను అమల్లోకి తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 'మేం మీ అభిప్రా యానికి విలువ ఇస్తాం' అనే స్లోగన్‌తో పోలీస్ ల సేవలపై ప్రజల అభిప్రాయం చెప్పేందుకు సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు సర్కార్ శ్రీకారం చుట్టింది. జిల్లాలోని అన్ని ఠాణాల్లో క్యూఆర్ కోడ్‌లను పోలీస్ అధికారులు ఏర్పాటు చేశారు. క్యూఆర్ కోడ్‌ను తీసుకువచ్చి ఐదు నెలల గడుస్తున్నా ప్రజలకు సరైన అవగాహన లేక స్కాన్‌ను సరైన విధంగా సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

**నేరుగా డీజీపీ కార్యాలయానికే...**


క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయాలంటే తొలుత సెల్ ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి సిటిజన్ ఫీడ్ బ్యాక్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లో పోలీస్‌ల తీరుపై ఫిర్యాదు చేస్తే ఫిర్యాదుదారుడికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయనే భయం సైతం నెలకొంది. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి పోస్ట్ చేసిన వివరాలన్నీ నేరుగా డీజీపీ కార్యాలయానికే వెళ్తోంది. ఆ ఫిర్యాదులను డీజీపీ కార్యాలయ ఉన్నతాధికారులు మినహా మరేవరు చూసే అస్కారం లేదని మెట్‌పల్లి డీఎస్పీ రాములు తెలిపారు. దీంతో ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ఎవరు భయపడవద్దని పోలీస్‌లు పేర్కొంటున్నారు. ప్రజలు సమస్యలతో పాటు పోలీస్‌లు అందిస్తున్న విశిష్ట సేవలను సైతం పోస్ట్ చేయవచ్చని తెలిపారు.


అవార్డు అందుకుంటున్న ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్

**ఉత్తమ సేవలకు అవార్డు..**

సిటిజన్ క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల అభిప్రాయం తెలుసుకొని తెలంగాణ పోలీస్‌శాఖ ఇటీవల ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన పోలీస్ స్టేషన్లకు అవార్డులు ప్రకటించింది. రాష్ట్రంలో మొత్తం 709 పోలీస్ స్టేషన్‌లు ఉండగా సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 10 మంది ఎస్‌ఐలకు డీజీపీ జితేందర్ అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో జిల్లాలోని మెట్‌పల్లి సబ్‌డివిజన్ పరిధిలో పని చేస్తున్న ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్, మేడిపల్లి ఎస్‌ఐ శ్యాంరాజ్‌లు అవార్డులు అందుకున్నారు.

**ప్రజలు నిర్భయంగా అభిప్రాయం తెలపవచ్చు**
**ఎ రాములు, డీఎస్పీ, మెట్‌పల్లి**



వివిధ సమస్యలపై ఠాణాకు వచ్చే ప్రజలు సిటిజన్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ ఫీడ్ బ్యాక్‌ను నిర్భయంగా తెలుపవచ్చు. తమ సమస్యలతో పాటు పోలీస్‌లు అందిస్తున్న సేవలపై తమ అభిప్రాయంను అప్లోడ్ చేయవచ్చు. ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యంగా ఉంటాయి. సబ్ డివిజన్ పరిధిలో పోలీస్‌లు అందిస్తున్న ఉత్తమ సేవలకుగానూ ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్, మేడిపల్లి ఎస్‌ఐ శ్యాంరాజ్ డీజీపీ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు.

## ఎల్లారెడ్డిపేటలో గోవధపై బీజేపీ నాయకుల ఆందోళన

- పోలీసులతో వాగ్వాదం..
- ఠాణాకు తరలింపు
- వాహనం, మాంసం స్వాధీనం..
- కేసు నమోదు


అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని రహస్య ప్రాంతంలో ఓ వర్గం వారు గోవధ చేస్తున్నారనే సమాచారంతో శనివారం బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. గోవధ స్థలానికి చేరుకునే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. బీజేపీ నాయకులను అడ్డుకోవడం వల్ల పోలీసులతో వాగ్వాదానికి దిగారు. గోవధ జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోరంటూ ఆగ్రహించారు.నాయకులను ఠాణాకు తరలించారు. నాయకులు పశు వైద్యాధికారి రాహుల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గోవధ చేసేందుకు తాము ఎవరికీ అనుమతించలేదని ఆయన స్పష్టం చేశారు. గోవధ జరిగిన ప్రాంతానికివెళ్లి పంచనామా నిర్వహించాలని తమ సిబ్బందిని ఆదేశించామని పేర్కొన్నారు. 6నుంచి 8ఏళ్ల వయసు ఉన్న కోడెను వధించారని గుర్తించినట్లు చెప్పారు. సుమారు మూడు గంటల పాటు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలుసుకున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఘటనపై బీజేపీ నాయకులతో చర్చించారు. చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. గోవధ జరిగిన ప్రాంతంలో ఉన్న పశువులను గోశాలకు తరలించాలని నాయకులు డిమాండ్ చేశారు. పశువులను తరలించేందుకు వినియోగించిన వాహనం, వధించిన మాంసం స్వాధీనపర్చుకుని కేసునమోదుచేసి దర్యాప్తుజరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

## యువకుడి అదృశ్యం


సాయి అభిలాష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సుభాష్‌నగర్‌కు చెందిన గుండు సాయి అభిలాష్ (27) మే 27వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడని మూడోఠాణా పోలీసులు తెలిపారు. ఇంటినుంచి బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈమేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు. గుర్తించిన వారు కరీంనగర్ మూడోఠాణా 9849888368, 99485 96365లో సమాచారం అందించాలని కోరారు.

## పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమాసాహెబ్

గణేశ్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో బీసీ, ఎస్సీఎస్టీమైనార్టీ పేదవిద్యార్థులకు 25శాతం ఉచితంగా సీట్లు కేటాయించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమాసాహెబ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం తెలంగాణ గిరిజనసంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. విద్యాహక్కు చట్టం వచ్చి దాదాపు 16ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. పేదలకు విద్యా, వైద్యం అందుబాటులోకి తీసుకొస్తే సరిపోతుందని, మరే ఉచితపథకాల అవసరం పెద్దగా ఉండదని అన్నారు. విద్యాసంస్థలు ఉచితసీట్లు ఇవ్వడానికి ముందుకు రావాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవు తామని తెలిపారు.

## జూలపల్లిలో యథేచ్ఛగా గోవధ

- పోలీసులకు బీజేపీ నాయకుల ఫిర్యాదు

జూలపల్లి, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): జూలపల్లి మండల కేంద్రంలో కొందరు వ్యక్తులు కొన్నేళ్లుగా పశువుల వధను యథేచ్ఛగా కొన్నేండ్లుగా నిర్వ హిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బీజేపీ మండల నాయకులు పశువధకు అడ్డుపడుతూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తు న్నారు. మండలంలోని కొందరు వ్యక్తులు శనివారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని గోవులను వధించారనే సమా చారంతో స్పందించిన బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ సనత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్‌ఐ సనత్‌కుమార్ బీజేపీ నాయకులతో అక్కడికి చేరుకున్నారు. విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న పశువుల మాంసం, అక్కడ ఉన్న పశువులను సంఘటన స్థలంలో పరిశీలించారు.

ఈ విషయమై పశువులను వధించి మాంసం విక్రయిస్తున్న వ్యక్తుల వివరాలను తెలుసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ పశువుల వధకు తప్పుడు ధ్రువపత్రాలను అందించిన సంబంధిత పశువైద్యాధికారిపై, అలాగే చట్టవిరుద్ధంగా గోవులను వధించి మాంసం విక్రహిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బొజ్జ సంపత్, సూర్యా, వేల్పుల రమేష్‌పృథ్వీమధుకర్ పాల్గొన్నారు.

## మసీదు స్థలంపై పోలీసుల విచారణ

చందుర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తమ పట్టాభూమిలో అక్రమంగా ముస్లింలు ప్రార్థనలు చేస్తున్నారని చందుర్తి మండలం బండపల్లి గ్రామానికిచెందిన ఓ యువకుడు శనివారం డయల్ 100కు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేష్ పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళ్లితే.. చందుర్తి, కోనరావుపేటమండలాల సరిహద్దు ప్రాంతంలోని బండపల్లి, బావుసాయిపేట గ్రామాలమధ్య 1987లో బండఎల్లికి చెందిన గడ్డం రాఘవరెడ్డి వద్ద నన్నుసాబ్, రంజాన్ ఆలీలు 0.08 గుంటల స్థలాన్ని మసీదు కోసం కొనుగోలు చేయగా, విక్రయదారుని మృతితో ఈ భూమి పట్టా మార్పిడి జరిగిందని, దాని పట్టాకోసం పట్టాదారురాలు గడ్డం అంతవ్వను పలు మార్లు అడిగితే తమ కుమారులు గల్ఫ్ నుంచి రాగానే పట్టా చేస్తామంటే దాటవేస్తూ వచ్చారని చందుర్తి సీఐ, ఎస్సైలకు బాధితులు, స్థానికులు వివరించారు. దీంతో పోలీసులు డయల్100కు కాల్‌చేసిన కరుణాకర్‌ను పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని చందుర్తి ఠాణావచ్చి సమస్య పరిష్కారం చేసుకోవాలని ఎస్సై రమేశ్ ఆదేశించినట్లు తెలిపారు. స్థల సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఎలాంటి పనులు చేపటకుండాశనివారం ఉదయంనుంచి సాయంత్రం వరకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

# కొండగట్టులో యువకుడి హత్య

- హతమార్చి గోతిలో పూడ్చివేత
- పోలీసుల అదుపులో అనుమానితులు

మల్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో ఉప్పు రమణారెడ్డి(30) అనే యువకుడు హత్యకు గురి అయ్యాడు. ఓ వివాహ వేడుకల్లో భాగంగా కొండగట్టులో కొందరు యువకులతో జరిగిన గొడవ దాడికి దారి తీయగా అది హత్య వరకు వెళ్లిన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. స్థానికులు, పోలీసువర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. కొండగట్టుకు చెందిన ఉప్పు రమణారెడ్డి మంగళవారం హల్దీ కార్యక్రమంలో పాల్గొన్న యువకులతో గొడవకు దిగాడు. ముగ్గురు యువకులు రమణారెడ్డిపై దాడి చేయడంతోపాటు బండరాయితో తలపై కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు సమాచారం. మృతదేహాన్ని కొండగట్టు మెట్ల మార్గం సమీపంలో ఉపాధిహామీ పథకంలో తవ్విన కందకాల్లో పూడ్చిపెట్టిన్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. అయితే రెండు రోజులుగా రమణారెడ్డి హత్యకు గురయ్యాడని ప్రచారం కావడం, కుటుంబసభ్యులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం విచారణ చేపట్టారు. సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ పూడ్చివేసిన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. పూడ్చిపెట్టిన మృతదేహాన్ని ఆదివారం వెలికితీయనున్నట్లు, పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతి చెందిన రమణారెడ్డిపై పీడీ యాక్ట్‌తో పాటు నలబైకి పైగా దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిసింది. పలు కేసుల్లో జైలుకు కూడా వెళ్లి వచ్చిన రమణారెడ్డిపై పోలీసులు గతంలోనే సస్పెక్ట్ షీట్ నమోదు చేశారు.


రమణారెడ్డి(ఫైల్)

## ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

తంగళ్లపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్ గ్రామం చింతలపల్లె వాసులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పరిసర గ్రామల ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు చింతలపల్లె పక్కనే ఉన్న మానేరు నది నుంచి ఇసుక రవాణాకు రెవెన్యూ అధికారులు అనుమతిచ్చారు. దీంతో గ్రామాన్ని ఆనుకొని ఉన్న మానేరు నది నుంచి ఇసుకను తరలించడానికి వచ్చిన ట్రాక్టర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇసుకను గ్రామం గుండా తరలించేది లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికిచేరుకుని గ్రామస్థులను శాంతింప జేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఇరుకైన రోడ్లు ఉన్నాయని, ఇసుక రవాణాను మరో మార్గం ద్వారా అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక రవాణాను అడ్డుకోవడం లేదని ఇసుక రవాణాను చింతలపల్లె గ్రామం నుంచి కాకుండా గండిలచ్చపేట శివారులో నక్కవాగు పక్కను ఉన్న మార్గం ద్వారా అనుమతి ఇవ్వాలని కోరారు.

- చింతలపల్లి నుంచి ఇసుక రవాణా నిలిపివేయాలి..

**తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన**

చింతలపల్లి గ్రామం నుంచి ఇసుక రవాణాను నిలిపివేయాలని గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందించారు.

## హెల్పర్‌కు విద్యుదాఘాతం.. తీవ్ర గాయాలు


గాయపడ్డ హెల్పర్ అంజనేయులు

చందుర్తి జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో విద్యుత్‌షాక్‌తో నక్క ఆంజనేయులు అనే అసిస్టెంట్ హెల్పర్‌కు శనివారం తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలో దేవునితండా గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా 11కేవీ విద్యుత్‌వైర్లు తగలడంతో ఆంజనేయులు కింద పడ్డాడా. ఈప్రమాదంలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆంజనేయులును 108లో వేములవాడ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ ఆంజనేయులును సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, సెస్ సిబ్బంది పరామర్శించారు.

## ప్రమాదవశాత్తు రైతుకు తీవ్ర గాయాలు

కరీంనగర్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌కు చెందిన చిట్కూరి అజయ్ కుమార్ శనివారం ఇరుకుల్ల శివారులో నారుమడి కోసం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ రోటవేటర్‌లో పడి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాక్టర్‌కు అడ్డుగా ఉన్న డ్రిప్ పైపును కాలుతో తప్పించే క్రమంలో అదుపు తప్పి రోటవేటర్‌లో పడిపోయాడు. వెంటనే అప్రమత్తమైన స్థానిక రైతులు అజయ్‌ని బయటకు తీసేందకు గంట పాటు శ్రమించారు. తీవ్రంగా గాయపడిన రైతును చికిత్స కోసం కరీంనగర్‌లోని ప్రవేటు ఆస్పత్రికి తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చొప్పదండి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్ క్రాస్‌రోడ్ వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. బొలెరో వాహనం బైక్‌ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఆర్నకొండకి చెందిన ఆవునూరి సంపత్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నరేష్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని సంపత్‌ను పోలీస్‌వాహనంలో నగునూరులోని ప్రతిమ హాస్పిటల్‌కి చికిత్స కోసం తరలించారు.

## ధరూర్‌లో భారీ అగ్నిప్రమాదం

- రూ. 70 లక్షలు ఆస్తి నష్టం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

జగిత్యాలరూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్ గ్రామంలోని పాత సామానుల దుకాణంలో శనివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. భారీగా మంటలు ఎగిసిపడి షెడ్డుతో పాటుగా, షెడ్డులో ఉన్న సామగ్రి, యంత్రాలు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఫైర్‌సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. పాత సామానుల దుకాణం పక్కనే పెట్రోల్ బంక్, గృహసముదాయాలు ఉన్నాయి. సకాలంలో ఫైర్‌ఇంజిన్ వచ్చి మంటలను ఆర్పివేయడంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో షెడ్డు యజమాని కొలగాని సత్యనారాయణరావుకు 40లక్షల రూపాయలు, ముంబాయికి చెందిన పాత సామాను దుకాణ యజమానికి 30లక్షల రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు ఫైర్ అధికారులు అంచనా వేశారు. సంఘటన స్థలాన్ని కలెక్టర్ బి సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, మాజీమంత్రి జీవన్‌రెడ్డి సందర్శించారు. సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.


దగ్ధమవుతున్న పాత సామానుల దుకాణం

## ఓబులాపూర్‌లో చిరుత కలకలం

- గొర్రెపై దాడి.. మృతి

మల్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాపూర్ అటవీ ప్రాంతంలో చిరుతపులి కలకలం రేపింది. శనివారం మేతకు వెళ్లిన గొర్రెల మందలోని ఓ గొర్రెపై దాడి చేసి చంపేసినట్లు యజమాని గుగ్గిళ్ల తిరుపతి తెలిపారు. తిరుపతికి చెందిన సుమారు అయిదు వందల గొర్రెలు మేతకు సమీప అటవీ ప్రాంతానికి వెళ్లగా మంద వెనుకాల వెలుతున్న గొర్రెపై చిరుత దాడి చేసినట్లు పేర్కొన్నారు. గొర్రెపై దాడి చేయడాన్ని అటవీ అధికారులకు సమాచారం అందించినట్లు చెప్పారు. చిరుతపులి సంచారంతో సమీప ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచిస్తున్నారు.



# నేడు మంత్రి వర్గ విస్తరణ

- కవ్వంపల్లి, అడ్లూరిలో ఒకరికి అవకాశం
- రేసులో ఆది శ్రీనివాస్ కూడా..

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ ఆదివారం జరగనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లో ఒకరికి అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. బీసీల్లో ఇద్దరికి అవకాశం కల్పిస్తే వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు అవకాశాలు ఉన్నట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో నలుగురికి చోటు కల్పిస్తారని వారిలో మాదిగ, బీసీ, రెడ్డి లేక వెలమ సామాజిక వర్గాలకు చెందిన వారు ఉంటారని అంటున్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లో ఒకరికి అవకాశం ఖాయమనే వార్తలు కాంగ్రెస్ వర్గాల నుంచి వినవస్తున్నాయి.

చెన్నూర్ శాసన సభ్యుడు వివేక్ వెంకటస్వామికి బెర్త్ దాదాపుగా ఖాయమని ఆయనతో పాటు మరొక ఎస్సీకి అవకాశం కల్పిస్తే జిల్లాలోని ఇద్దరు మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం దక్కుతుందని అంటున్నారు. బీసీ సామాజిక వర్గంలో వాకాటి శ్రీహరి (ముదిరాజ్)కి మంత్రి పదవి దక్కుతుందని, ఇద్దరు బీసీలకు అవకాశం కల్పిస్తే వేములవాడ శాసన సభ్యుడు, విప్ ఆది శ్రీనివాస్‌కు ఆ బెర్త్ కట్టబెడతారని అంటున్నారు. రామగుండం శాసన సభ్యుడు రాజ్‌ఠాకూర్ కూడా మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ముగ్గురు లేక నలుగురికి మంత్రి పదవులు దక్కుతాయని భావిస్తున్న ఈ విస్తరణపై ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు ఆశలు పెట్టుకున్నారు. ఎవరి ఆశ నెరవేరుతుందో, అధిష్ఠానం ఎవరికి అవకాశం ఇస్తారోనని జిల్లా కాంగ్రెస్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

## ఉద్యోగులకు పెండింగ్ డీఏలు చెల్లించాలి

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



జగిత్యాల జిల్లా రంగాపూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని నిజామాబాద్ ఎమ్మెల్సీ, తెలంగాణజాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలో పలుప్రైవేట్ కార్యక్రమాలకు హాజరైన కవిత మేడిపల్లి మండలం రంగాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలుచేసిన ఉద్యోగులను కాంగ్రెస్‌ప్రభుత్వం కించపరిచిందన్నారు. ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించిందన్నారు. టీఏలు, డీఏలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇస్తామని ఉద్యోగస్థులను నమ్మించారన్నారు. టీఏలు, డీఏలు సమయానికి వేతనాలు ఇస్తామని, ఒకటో తేదీ నిండకముందే అన్ని రకాల కిస్తీలు కట్టుకునే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ నేతలు ఉద్యోగులను మోసగించిందని విమర్శించారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి కేవలం ఒక్క డీఏ విదిల్చారని.. ప్రభుత్వం తీరుపై ఉద్యోగులంతా తీవ్రఅసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఉద్యోగస్థుల త్యాగాలను, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగస్థుల పాత్రను కాంగ్రెస్ ప్రభుత్వం కించపరిచిందని విమర్శించారు. ఉద్యోగులకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే నెరవేర్చాలని, పెండింగ్ డీఏలన్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, నాయకులు ఒరుగంటి రమణారావు, రాంమోహన్‌రావు, దారిశెట్టి రాజేశ్, మారు సాయిరెడ్డి, ఎలాల దశరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీఈఈ సెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

తిమ్మాపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీజీ డీఈఈ సెట్-2025 ఫలితాలు ప్రకటించారని ఇందులో ఉత్తీర్ణులైన ఆసక్తి, అర్హతగల అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన జూన్9 నుంచి ఉంటుందని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన అభ్యర్థులు ఎల్ఎండీ కాలనీలోగల ప్రభుత్వ జిల్లావిద్యా శిక్షణా సంస్థ(డైట్)లో జూన్9 నుంచి ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో డీఈఈ సెట్-2025 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఇంటర్ వరకు స్టడీ, కుల, ప్రస్తుత సంవత్సర ఆదాయం సర్టిఫికెట్‌లతో కేటాయించిన జిల్లా డైట్‌కు వెళ్లి హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు డీఈఈ -2025 వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

వేములవాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుడు కిష్టయ్య తన కూతురు మధురిమను వేములవాడజిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో చేర్పించారు. కథలాపూర్ మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కిష్టయ్య 9వ తరగతి చదువుతున్న తన కూతురును ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని నిర్ణయించుకున్నారు. శనివారం వేములవాడలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మండల విద్యాధికారి, పాఠశాల హెచ్‌ఎం బన్నాజి తదితరులు అభినందించారు.



వేములవాడ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో అడ్మిషన్ తీసుకుంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు కిష్టయ్య

## రెండు కోడెలు మృతి

- మరో రెండింటి పరిస్థితి విషమం

వేములవాడ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం తిప్పాపూర్ గోశాలలో మరో రెండు కోడెలు మృతిచెందాయి. అనారోగ్యంతో ఉన్న రెండు కోడెలు శనివారం తెల్లవారు జామున మృతిచెందినట్లు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు గోశాలలో మృతిచెందిన కోడెలసంఖ్య 33కుచేరింది. గోశాలలో అనారోగ్యం బారిన పడిన 14కోడెలకు వెద్యాధికారులు చికిత్స అందిస్తుండగా, వాటిలో 10 కోడెలు కోలుకుంటున్నట్లు తెలిపారు. మరో రెండు కోడెల పరిస్థితి విషమంగా ఉందని, కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## ఆహార నాణ్యతకు మారుపేరు ఐసీహెచ్

- ఉద్యోగులకు నాణ్యమైన ఆహారం
- ఆహార భద్రత దినోత్సవంలో ఏజీఎం విజయ్‌కుమార్ సిక్దర్



ఐసీహెచ్ మేనేజర్ కార్తికేయన్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న అధికారులు


జ్యోతినగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్టులలో ఇండియన్‌కాఫీ హౌజ్(ఐసీహెచ్) ఉద్యోగులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నదని ఆప్రాజెక్టు ఏజీఎం (హెచ్‌ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్ అన్నారు. ప్రపంచ ఆహారభద్రత దినోత్సవాన్ని శనివారం ఎన్టీపీసీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం ప్రసంగిస్తూ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు స్వచ్ఛమైన ఆహారాన్ని అందించడంవల్ల ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. నాణ్యత విషయంలో రాజీలేకుండా మంచిసర్వీస్ చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టులతోపాటు పలు ఇండస్ట్రియల్ క్యాంటీన్లను నిర్వహిస్తున్న ఐసీహెచ్ ప్రపంచ స్థాయి సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. నాణ్యత, నిర్వహణ, సర్వీసులో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఐసీహెచ్ పేరు నమోదు చేసిందని సిక్దర్ గుర్తు చేశారు. భవిష్యత్‌లో కూడా ఐసీహెచ్ సిబ్బంది ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. ఇండియన్‌కాఫీ హౌజ్ మేనేజర్ పి.ఎస్.కార్తికేయన్‌ను ఏజీఎం సన్మానించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్న ఐసీహెచ్‌కు సర్టిఫికెట్, జ్ఞాపికను అందజేశారు. డీజీఎంలు ప్రవీణ్ చౌదరి, జితేంద్ర కుమార్, సీనియర్‌మేనేజర్ ఆదేశ్‌కుమార్ పాండే, పాల్గొన్నారు.

## నేడు ఉమ్మడిజిల్లా బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జూనియర్ బాల బాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని అసోసియేషన్ ప్రధానకార్యదర్శి సంపత్‌కుమార్ తెలిపారు. పోటీలలో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈనెల10,11తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9100668474 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## మెదడులో ముప్పు.. ముందస్తుగా గుర్తిద్దాం..

నేడు ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డే



సుభాష్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో ముఖ్యమైనది మెదడు. మెదడులోని కణజాలాలు అవయవాల పనితీరులో కీలకంగా పని చేస్తాయి. మెదడులోని కణజాలాల్లో ఏర్పడుతున్న కణితులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. దేశంలో బ్రెయిన్ ట్యూమర్ (మెదడు కణితి) కేసుల సంఖ్య పెరుగుతోంది. ఏటా 28వేల మందికిపైగా భారతీయులు దీని బారిన పడుతున్నారు. అన్ని కణుతులు ప్రమాదకరమైనవి కాకపోవచ్చని, లక్షణాలు గమనించి వ్యాధిని ప్రారంభంలో గుర్తిస్తే నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. బ్రెయిన్ ట్యూమర్ అంటే మెదడులో కణితి అని అర్థం.

మెదడు లేదా చుట్టు పక్కల కణ జాలంలో అసాధారణ రీతిలో కణాల పెరుగుదల ఉంటుంది. సాధారణ మెదడు కణాలు జన్యు మార్పులకు లోనైనప్పుడు ఈ పెరుగుదల కనిపిస్తుంది. వీటిలో నిరపాయకరమైనవి ఉంటాయి. అవి నెమ్మదిగా పెరుగుతాయి. శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించవు. ప్రాణాంతక కణుతులు మెదడు కణజాలంపై దాడి చేస్తాయి. జన్యుపరమైన కారకాలు, పర్యావరణ ప్రభావాలు, కొన్నిసార్లు ఎటువంటి కారణం లేకుండానే ఈ కణుతులు వస్తాయి.

### బ్రెయిన్ ట్యూమర్ డే నేపథ్యం

ప్రపంచంలో బ్రెయిన్ ట్యూమర్ ప్రభావం, నిరంతర పరిశోధన, అవగాహన, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడం కోసం యేటా జూన్ 8న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మెదడు కణితి అనేది పెద్దలు, పిల్లలు ఎవరిలోనైనా ప్రభావితం చేసే ప్రాణాంతక రుగ్మతల్లో ఒకటి. మెదడులో కనిపించే అన్ని ప్రా థమిక కేంద్రనాడీ వ్యవస్థ కేన్సర్లలో ఎక్కువ భాగం(85-90%) మెదడు కణితుల కారణంగానే సంభవిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**లక్షణాలు :** కణితి ప్రాంతాన్ని బట్టి ప్రారంభ లక్షణాలు మారుతూ ఉంటాయి. తలనొప్పి, మూర్ఛ, మాట్లాడడం, ఆలోచించడంలో ఇబ్బంది ఏర్పడడం, ప్రవర్తనలో మార్పు, పక్షవాతం, సమతుల్యత కోల్పోవడం లేదా తలతిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మసక దృష్టి, వినికిడి లోపం, ముఖం తిమ్మిరి, వాంతులు, మింగడంలో ఇబ్బందులు, గందరగోళ మనస్తత్వం, ఆసక్తి లేక పోవడం, వాసన కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

### ప్రారంభంలో గుర్తిస్తే నయం చేయవచ్చు

**డాక్టర్ రాజీవ్‌రెడ్డి, న్యూరో సర్జన్, మెడికవర్ హాస్పిటల్**



లక్షణాలు గమనించి వ్యాధిని ప్రారంభంలో గుర్తిస్తే నయం చేయవచ్చు. ప్రస్తుతం వైద్య రంగంలో అత్యాధునిక వైద్యం, పరిక రాలు, మందులు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో డాక్టర్‌ను సంప్రదిస్తే బ్రెయిన్ ట్యూమర్‌ను తగ్గించొచ్చు.

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- స్వామివారిని దర్శించుకున్న 60 వేల మంది



రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రాజన్న ఆలయానికి శనివారం 60 వేల మందికి పైగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఉదయాన్నే భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి ప్రవేశించి పార్వతిరాజరాజేశ్వర స్వామివారలను దర్శించుకున్నారు. అనంతరం పరివార దేవతాలయాలైన సీతారామచంద్రస్వామి, అనంతపద్మనాభస్వామి, సోమేశ్వర స్వామి, బాలత్రిపుర సుందరీదేవి ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు శివకల్యాణ పూజలో పాల్గొని తరించారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా వేములవాడ రాజరాజేశ్వర స్వామిని సినీ ఇండస్ట్రీ డీవోపీ ప్రయాంక వర్మ, భూపతిరాజులు దర్శించుకున్నారు. అర్చకులు వారిని ఆశీర్వదించి రాజన్న ప్రసాదం అందించారు.

- రూ. 5 లక్షల విరాళం

వేములవాడ పట్టణానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు మధు గుండయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి మధులక్ష్మీ, కుమారులు డాక్టర్ రాధకిషన్, శ్రీనివాస్‌లు రూ.5 లక్షల విరాళాన్ని బ్రహ్మణ నిత్యాన్నదాన సత్రం కోసం అందజేశారు. శంకరమఠంలో బ్రహ్మణ సంఘం నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాప రామకృష్ణ, బుడంగారి మహేష్ తదితరులు ఉన్నారు.

## భక్తులతో పోటెత్తిన కొండగట్టు



క్యూలైన్‌లో వస్తున్న భక్తులు

మల్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువ జాము నుంచి తరలివచ్చిన భక్తులతో అంజన్న ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. వ్యవసాయ పనులు ప్రారంభం కానుండడం, విద్యసంస్థలు తిరిగి తెరచుకోనుండడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చి స్వామి వారిని దర్శించు కున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగగా వాహనాలతో జైజంక్షన్ వద్ద ఇబ్బందులు పడ్డారు. భక్తులు అంజన్నతో పాటు బేతాళుడు, రాముల వారని దర్శించుకున్నారు. నూతన వాహనాలకు అంజన్న సన్నిదిలో పూజలు చేయించారు.

## ధర్మపురి నరసింహుని సన్నిధిలో భక్తుల సందడి

- కిటకిటలాడిన ఆలయాలు
- భక్తుల పూజలు



నరసింహ స్వామివారల హారతి దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.. సెలవు దినాలు కావడంతో ఉదయం వరకు క్షేత్రం భక్తులతో రద్దీగా మారింది. క్షేత్ర నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం ఆల యాలకు చేరుకుని భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామివారల నిత్య కల్యాణం జరిపించి పూజలుచేశారు. రామలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయస్వామిచుట్టు భక్తులు ప్రదక్షి ణాలు చేశారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీ ణ్‌కుమార్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మం త్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉపప్రధాన అర్చ కులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చారి, చిలుకముక్కు రమణాచారి, నంబి నరసింహమూర్తి నిత్య పూజ లు నిర్వహించారు.భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తలు, సిబ్బంది తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ పరీక్షల ఫలితాల విడుదల

కరీంనగర్ టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్‌స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్ పరీక్షలఫలితాలు విడుదల చేసినట్లు జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య, ఉమ్మడి జిల్లా పరీక్షల కో-ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావు ఒకప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లాలో ఎస్సెస్సీలో571 విద్యార్థులకు245మంది 42.91శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. పెద్దపల్లి జిల్లాలో 340 మందికి 197మంది 57.94శాతం, కరీంనగర్ జిల్లాలో 440మందికి 324మంది 73.64 శాతం, రాజన్నసిరిసిల్లజిల్లాలో 267 మందికి 240 మంది 89.89శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇంటర్మీడియెట్‌లో జగిత్యాలలో 574మందికి 305మంది 53.14శాతం, పెద్దపల్లిజిల్లాలో 705మందికి 396మంది 56.17శాతం, కరీంనగర్‌లో 967మందికి 661మంది 68.36శాతం, రాజన్నసిరిసిల్లలో 792 మందికి 558 మంది 70.45శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

## కలికోట-పోతారం రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- ఏళ్లుగా వినతులను పట్టించుకోని పాలకులు
- వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అధ్వానంగా ఉన్న కలికోట - పోతారం రోడ్డు

కథలాపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాలైన కలికోట-పోతారం గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు నిర్మాణంపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్డు బాగుచేయాలని వినతిపత్రాలు అందిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిసి తమగోడు వెల్లబోసుకుంటున్నా తమ పట్ల కనికరం చూపడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

- లొంకరామేశ్వరుని దర్శనానికి ఇబ్బందులు

పోతారం గుట్టల్లో స్వయంభూ దేవాలయంగా ప్రసిద్ధిచెందిన లొంకరామేశ్వర స్వామిని దర్శనం చేసుకునేందుకు వందలాదిగా వెళ్తుంటారు. వేములవాడ-కోరుట్ల రహదారిని ఆనుకుని ఉన్న కలికోట నుంచి పోతారం కేవలం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. అక్కడి నుంచి మరో రెండు కిలోమీటర్లు వెళితే లొంకరామేశ్వరుని సన్నిధానానికి చేరుకుంటారు. భక్తులకు ఈ రోడ్డు వెంట వస్తే దూరభారం తగ్గుతుంది. ఈ విషయం అనేక సార్లు ఎంపీలు, ఎమ్మెల్యేలకు చెప్పుకున్నా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో ఈ రోడ్డు వెంట కనీసం కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. గతంలో పలుమార్లు ఎన్నికల్లో ఈ రోడ్డును బీటీగా మార్చుతామని నాయకులు ఇచ్చిన హామీలు నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి మారుమూల గ్రామాల రోడ్లను మెరుగు పరిచేందుకుగాను ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద నిధులు వెచ్చించాలని గ్రామస్థులు చేసిన వినతికి అధికారులు సర్వేలు చేసి గతంలో ప్రభుత్వానికి నివేదికలు కూడా పంపారు. పలు కారణాలు చూపి ఈ పథకం కింద నిధులు వెచ్చించడానికి అవకాశాలు లేవని చేతులెత్తేసినట్టు తెలిసింది.

- బీటీ రోడ్డుగా మారిస్తే ఎంతో సౌకర్యం

**ధర్మపురి జలంధర్, మాజీ సర్పంచ్ పోతారం**



కలికోట-పోతారం లింకు రోడ్డు బాగు చేస్తే ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఎన్నోసార్లు ఎమ్మెల్యే, ఎంపీలకు గ్రామస్థులమంతా కలిసి వినతిపత్రాలు ఇచ్చినా నిధులు మాత్రం కేటాయించలేదు. మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని నాయకులు చెబుతున్నా పట్టించుకోకపోవడం దారుణం. రోడ్డ మెరుగు పడితే లొంకరామేశ్వరుని వద్దకు బస్సు వసతి కలగడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ఈ రోడ్డును బీటీగా మార్చడానికి నిధులు కేటాయించాలి.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్



పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

హుజూరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో బక్రీద్ వేడుకలను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గా మైదానంలో ముస్లిందరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చిన్నా, పెద్ద తేడా లేకుండా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏసీపీ మాధవి, టౌన్ సీఐ కరుణాకర్, సిబ్బందికి ముస్లిం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ ముజాహిద్ హుస్సేన్, ముఫ్తీ షాకీర్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

**శంకరపట్నం/గంగాధర/సైదాపూర్/వీణవంక:** మండలకేంద్రాలతోపాటు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు అలాయ్ బలాయి చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

### త్యాగానికి ప్రతీక బక్రీద్

**మానకొండూర్:** బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని మానకొండూర్‌లోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే సత్యనారాయణ ఈద్గా వద్దకు చేరుకొని ముస్లింలను ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలియజేశారు. మజీద్ కమిటీ చైర్మన్ సయ్యద్ శర్ఫొద్దీన్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ సిరాజోద్దీన్, ఏఎంసీ చైర్మన్ ఎం ఓదెలు, కొత్తకొండ శంకర్, కోండ్ర సురేష్, మడుపు ప్రేమ్‌కుమార్, తాళ్లపల్లి నరేష్, ముస్లింలు ఉన్నారు.



మొలంగూర్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**చొప్పదండి :** మండలంలోని ముస్లింలు బక్రీద్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చొప్పదండిలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు షెడ్యూల్ విడుదల

కరీంనగర్ టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్సెస్సీ, ఇంటర్ అడ్మిషన్ల కోసం షెడ్యూల్ విడుదల చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్‌లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థులు తెలంగాణ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావును 8309212661 నంబరులో సంప్రదించాలని కోరారు.

## దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మహిళా, పిల్లలు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి శారీరక దివ్యాంగులకు, అంధులకు, బధిరులకు, మానసిక దివ్యాంగులకు రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వెహికల్స్ ఉచితంగా అందజేయనున్న నేపథ్యంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ అధికారి సరస్వతి ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు tps://obmms.cgg.gov.in వెబ్ సైట్‌లో ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని జిల్లా సంక్షేమ శాఖాధికారి కార్యాలయం, లేదా 9494317315 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## లఘు చిత్రం షూటింగ్ ప్రారంభం



షూటింగ్ ప్రారంభిస్తున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మహాశక్తి దేవాలయంలో దర్శకుడు అనసూరి భూనాథాచారి, నిర్మాత కట్ట సత్యనారాయణచారి ఆధ్వర్యంలో రూపొందిస్తున్న 'కన్నీటి గాథ' సందేశాత్మక లఘు చిత్రం షూటింగ్‌ను శనివారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. నటీ నటులను, చిత్ర బాధ్యులను మంత్రి అభినందించారు. రెడీమేడ్ షోరూంలు రావడం, బంగారం ధరలు పెరగడం, పెట్టుబడి లేకపోవడంతో చేతి వృత్తిపై ఆధారపడి జీవించే స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ చిత్రాన్ని తీస్తున్నట్లు చిత్ర బాధ్యులు వివరించారు. రాష్ట్ర, జిల్లా, పట్టణ స్వర్ణకార సంఘాల నాయకులు ముత్తోజు శ్రీనివాస్, కడార్ల శివప్రసాద్, రావుల శ్రీకాంత్, కందుకూరి శ్రీనివాస్, కడార్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కరీంనగర్ డెయిరీకి అంబులెన్స్ విరాళం



అంబులెన్స్ అందజేస్తున్న పారిశ్రామిక వేత్తలు

భగత్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామిక వేత్త కేసరిమల్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు భగవాన్‌దాస్ కర్వా, వేణుగోపాల్ కర్వా కరీంనగర్ డెయిరీకి వెటర్నరీ అంబులెన్స్‌ను విరాళంగా అందజేశారు. శనివారం కరీంనగర్ డెయిరీ అవరణలో శ్రీవెంకటేష్ గ్రానైట్స్ (ఎస్‌విజి)ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు భగవాన్ దాస్ కర్వా, కృష్ణ కర్వాలు వెటర్నరీ అంబులెన్స్‌ను కరీంనగర్ డెయిరీ చైర్మన్ సిహెచ్ రాజేశ్వర్‌రావుకు అందించారు. డెయిరీ ఎండీ శంకర్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు టవర్ సర్కిల్ వద్ద చేప మందు పంపిణీ

కరీంనగర్ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని టవర్ సర్కిల్ వద్ద ధన్వంతరి అయుర్వేద కళానికేతన్ ఆధ్వర్యంలో కామారపు నరసింహస్వామి, విశ్వనాథం నేతృత్వంలో ఆది, సోమ వారాల్లో ఉదయం 5 గంటల నుంచి 108 వన మూలికలతో కూడిన చేప మందు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. శనివారం కూడా కొందరు చేప మందును స్వీకరించారు.

# మానేరు విద్యాసంస్థలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



తరగతి గదులను ప్రారంభిస్తున్న బండి సంజయ్ కుమార్

కరీంనగర్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ నాంది పలుకుతున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తీగలగుట్టపల్లిలో ఏర్పాటు చేసిన మానేర్ హగ్స్ అండ్ హర్ట్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానేరు సంస్థల ద్వారా ఉన్నత విలువలు, అత్యున్నతమైన ప్రమాణాలతో విద్యాబోధన అందుతోందన్నారు. 30 ఏళ్లగా కరీంనగర్‌లో విద్యాబోధనను కొనసాగిస్తున్న మానేరు విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదోతరగతి విద్యార్థినులకు త్వరలోనే సైకిళ్ల అందజేయనున్నట్లు తెలిపారు. సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంతోపాటు ఇతరరంగాల్లో మానేరు విద్యాసంస్థలు పాలు పంచుకోవడం అభినందనీయమన్నారు. మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఏఐ తరహా విద్యావిధానాన్ని పాఠశాలల్లో బోధించనున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్ సునీతారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేష్, మాజీ కార్పొరేటర్లు కొలగాని శ్రీనివాస్, లావణ్యశ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ డివిజన్లను విడదీసే ప్రయత్నం ఆపాలి

కరీంనగర్ టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వార్డుల పునర్విభజనతో ఎస్సీ డివిజన్లను విడదీసే ప్రయత్నాన్ని ఆపాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర చైర్మన్ కంసాల శ్రీనివాస్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి దళితవాడలుగా ఉన్న కార్ఖానగడ్డ, దుర్గమ్మగడ్డ, కిసాన్‌నగర్, సుభాష్‌నగర్, అంబేద్కర్‌నగర్, ఇందిరానగర్, బుట్టిరాజారాం కాలనీ వంటి వాటిని ఏ మున్సిపల్ ఎన్నికల్లోనూ విడదీయలేదన్నారు.

## మోదీ పాలనలో స్వయం సమృద్ధి

భగత్‌నగర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం స్వయం సమృద్ధి సాధిస్తున్నదని బీజేపీ పశ్చిమ జోన్ కార్యశాల ప్రభారి కరివేద మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని రేకుర్తిలో పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల పాలనలో దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలను పరిష్కరిస్తూ ప్రపంచంలోనే భారతదేశాన్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టారన్నారు. పశ్చిమ జోన్ మాజీ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, రాష్ట్ర, జిల్లా జోన్ నాయకులు శక్తి కేంద్ర ప్రముఖులు, బూత్ అధ్యక్షులు ఎన్న ప్రకాశ్, బండ రమణారెడ్డి, దేశ శిల్ప, సుధాకర్ పటేల్, రెడ్డి శ్రీనివాస్, మామిడి రమేష్, తిరుమల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీ ఉద్యమం



అభివాదం చేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీలు ఉద్యమించాలని, అదే లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితి ముందుకు సాగుతోందని సమితి (ఎంఏఎస్‌ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు అన్నారు. శనివారం నగరంలోని పద్మశాలీ ట్రస్టు భవన్‌లో బీసీ సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన కోసం మన పిల్లల భవిష్యత్ కోసం సమితి ఏర్పాటు చేశామన్నారు. నాయకులు వాసాల రమేశ్, మెతుకు సత్యం, స్వర్గం మల్లేశం, జీఎస్ ఆనంద్, వొల్లాల కృష్ణహరి, పోలు సత్యనారాయణ, రుద్ర రాజు, మంగలిపల్లి శంకర్, అలస భద్రయ్య, స్వర్గం నర్సయ్య, దొంత ఆనందం, చేరాల మల్లికార్జున్ దేవ్, వేముల చంద్రశేఖర్, రాచకొండ విఠలేశ్వర్, మంచికట్ల కోటయ్య, ఎన్నం మునీందర్, కలర్ సత్తన్న, దూస కైలాసపతి, రాజశేకర్ తదితరులు పాల్గొన్నారు.

# దుబాయ్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు

కరీంనగర్ అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక, సంక్షేమ సంఘం(ఈటీసీఏ) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను శుక్రవారం అజ్మాన్‌లోని మైత్రీ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పీచర మాట్లాడుతూ రాష్ట్రసాధనలో అమరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ఈటీసీఏ జూన్ 2025-27 కాలానికి నూతన కార్యవర్గ సభ్యులను ఫౌండర్ కిరణ్ కుమార్ ప్రకటించారు. గడిచిన రెండు సంవత్సరాల కాలంలో అధ్యక్షుడు మామిడి శ్రీనివాస్‌రెడ్డి, టీం సభ్యులు నిర్వర్తించిన బాధ్యతలను అభినందించారు. కొత్త కార్యవర్గం మరింత ఉత్సాహంతో పనిచేయాలని ఆకాంక్షించారు. కోర్ కమిటీ అధ్యక్షుడిగా జగదీష్ రావు చీటీ, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ అలిగేటి, ప్రధాన కార్యదర్శిగా రాణి కొట్ల, సంయుక్త కార్యదర్శిగా శేఖర్ గౌడ్ గుండవేని, కోశాధికారిగా తిరుమల్‌రావు బీరెల్లి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా వినోద్ కుమార్, అన్నపూర్ణ, సంతోష్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మమతా, సారిక పీచర, రఘు ఎలిగేటి, రాము కందుకూరి తదితరులు నియామకయ్యారు.



అమరులకు నివాళులర్పిస్తున్న ఈటీసీఏ ఫౌండర్ కిరణ్‌కుమార్ పీచర

## ● న్యూస్‌బాక్స్

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జూన్7 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టు ఏడీఈలు శ్రీనివాస్‌గౌడ్, లావణ్య ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 వరకు ముకరాంపుర, బస్టాండ్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, కలెక్టరేట్, ఆటోనగర్, టీఎస్ ఎన్‌పీఎల్ టవర్, మల్లికార్జునకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

### హామీలు అమలు చేయాలి

కరీంనగర్ టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులను మభ్యపెట్టడం సరికాదని, మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జావేద్ అన్నారు. ఐదు డీఏలకు ఒక్క డీఏను ప్రకటించి రెండు డీఏలు విడుదల చేసినట్లు ప్రకటించడం ఉద్యోగులను మభ్య పెట్టడమే అన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

భగత్‌నగర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నట్లు కొత్తపల్లి మండల విద్యాధికారి తుమ్మ ఆనందం తెలిపారు. శనివారం కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు.

### గో పూజా మహోత్సవం

కరీంనగర్ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూపరిషత్, గో రక్షా విభాగ్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని కామధేను గో విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం గో పూజా మహోత్సవంలో భాగంగా గో పూజలు నిర్వహించారు. గోరక్షా రాష్ట్ర కమిటీ సభ్యుడు వుట్కూరి రాధాకృష్ణారెడ్డి, జిల్లా ప్రముఖ్ నాగరాజు, గో శాల నిర్వాహకుడు రామారావు, సిరిసిల్ల గో రక్షా ప్రముఖ్ సంతోష్, రాజేశ్వరశర్మ పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

చొప్పదండి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఉపాధ్యాయులు గ్రామస్థులను కోరారు. శనివారం మండలంలోని గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. వెదురుగట్టులో బడిబాట కార్యక్రమంలో బాగంగా ఎస్‌జీటీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దామెర అశోక్ రెడ్డి, రవికుమార్, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మీ అనిత, మహేష్, జెస్సీ ఎస్‌జిటీ రాష్ట్ర కార్యదర్శి శాంతి కుమార్ పాల్గొన్నారు.

### ఇల్లందకుంటలో బడిబాట..



సిరిసేడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**ఇల్లందకుంట:** మండలంలోని సిరిసేడు గ్రామంలో ఎంఈవో రాములు మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలను బలోపేతం చేయడంకోసం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో మంచిబోధన జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలోర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జగదీశ్వర్, శ్రీనివాస్, అపర్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్లు రమ, రజినీ, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

## ఉగ్రవాద అంతం మోదీ లక్ష్యం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్‌రావు

ఇల్లందకుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉగ్రవాదం అనేపదం లేకుండా చేయడమే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని బీజేపీజిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు. శనివారం ఇల్లందకుంట మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం 11ఏళ్ల పరిపాలనలో సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. సమావేశంలో రావుల విజయ్ బాబు, గుత్తికొండ రాంబాబు, అంతం ఎల్లారెడ్డి, నల్ల లింగారెడ్డి, గోపాల్, పవన్‌రెడ్డి, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన దేశిని

జమ్మికుంట రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌గౌడ్, మంత్రి పొన్నంప్రభాకర్‌ను కాంగ్రెస్‌పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబుతో కలిసి నాయకులు దేశిని కోటి, దొంత రమేష్, జిల్లెల తిరుపతిరెడ్డి హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా వేర్వేరుగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్నాం



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించేందుకు మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణసౌకర్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలోగల సాయిరాం గార్డెన్స్‌లో మండలానికి చెందిన 416మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు ఆర్థికంగా చేయూతనిందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళా గ్రూపుల సభ్యుల ద్వారా లక్ష రూపాయల మేరకు రుణం పొందేందుకు వెసులుబాటు కల్పించిందని అన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు విడతల వారీగా ఎలాంటి జాప్యం లేకుండా చెల్లింపులు జరుగుతాయని అన్నారు. తొలి విడుతగా ఇచ్చే లక్ష రూపాయలను రుణం పొందిన మహిళా సంఘాలకు తిరిగి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన కొత్తపల్లి గ్రామానికి తొలుత 32ఇళ్లు మంజూరు చేయగా, కేవలం 14 మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో విజయ్ కుమార్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ గంగాధర్, ఎస్సై కదిరి శ్రీకాంత్‌గౌడ్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు బండారి రమేష్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్‌ఎల్ గౌడ్, నాయకులు మామిడి అనిల్‌కుమార్, గోపుమల్లారెడ్డి, తమ్మనపల్లి శ్రీనివాసరావు, కుంట రాజేందర్‌రెడ్డి, పోలు రాము, రమేష్, బుదారపు శ్రీనివాస్, మాచర్ల అంజయ్య ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగ్గు పోసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు

జమ్మికుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు శనివారం ముగ్గు పోసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ పట్టణఅధ్యక్షుడు సుంకరిరమేష్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి నిరుపేదలకు ఒక్క ఇల్లు కూడా పంపిణీ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిజమైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరుపత్రాలు అందజేసిందన్నారు. కార్యక్రమం లో పట్టణ అధ్యక్షుడు సుంకరిరమేష్, టీపీసీసీ ప్రచారకమిటీ సాయిని రవి, మార్కెట్ వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి, జిల్లాయూత్‌కాంగ్రెస్ సెక్రెటరీ కుమ్మరిశ్యామ్, నాయకులు పాతకాల అనిల్, సతీష్, సుధాకర్, ప్రణయ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## మెగా లోక్‌అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలి

● పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్

జమ్మికుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మెగా లోక్‌అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలని పట్టణసీఐ ఎస్ రామకృష్ణగౌడ్ అన్నారు. శనివారం జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ ఈనెల 14న జరుగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో రాజీపడే కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఇరువర్గాల మధ్య చట్ట సమ్మతమైన రీతిలో వివాదాలు పరిష్కరించడమే లోక్‌అదాలత్ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. రాజీమార్గమే రాజమార్గం అన్నారు.

## బ్రిడ్జి నిర్మించాలని నిరసన



లక్ష్మీదేవిపల్లిలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

గంగాధర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బ్రిడ్జి నిర్మించాలని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీదేవిపల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూలం కల్యాణ్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో వంతెనను పరిశీలించి. గెలిచిన మూడు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారన్నారు. గెలిచి సంవత్సరం గడిచినా ఇప్పటికీ వంతెన నిర్మాణంపై కనీసం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రెండు రోజుల్లో బ్రిడ్జి నిర్మాణంపై చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున రెండు మండలాల ప్రజలతో ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇనుకొండ నర్సింహారెడ్డి, లక్ష్మణ్, వెంకటరెడ్డి, బొంగాని మహేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ ఉత్పత్తులు పెంచడమే లక్ష్యం

గంగాధర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తులు పెంచడమే లక్ష్యంగా రైతులు నూతన సాంకేతికను వినియోగించుకోవాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త బజేంద్రసింగ్ అన్నారు. శనివారం గంగాధర మండలం బూరుగుపల్లి, వెంకటయ్యపల్లి గ్రామాల్లో వికసిత్ కృషిసంకల్ప్ అభియాన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన సంపన్న రైతు దేశాకి గర్వ కారణం అనే ఉద్దేశ్యంతో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి వ్యవసాయం, అనుబంధరంగాల్లో రాణించుటకు అవగాహన కల్పించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంపై అందిస్తున్న సంక్షేమపథకాలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే జమ్మికుంట శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు, మత్స్యశాస్త్రవేత్త ప్రభాకర్, ఏడీఏ ప్రియదర్శిని, ఏవో శ్రీనివాస్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న శాస్త్రవేత్త బజేంద్ర సింగ్

## ఎంఎన్‌సీల్లో జ్యోతిష్మతి విద్యార్థులకు ఉద్యోగాలు

తిమ్మాపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్‌సైన్స్ కళాశాలకు చెందిన 12మంది విద్యార్థులు మల్టీ నేషనల్ కంపెనీ (ఎంఎన్‌సీ)లో ఉద్యోగాలు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఇందులో ప్రస్తుతం బీటెక్ నాలుగో సంవత్సరం సీఎస్ఇ, సీఎస్ఎం చదువుతున్న విద్యార్థుల్లో రూ.3.6లక్షల వార్షిక వేతనంతో 8మంది ఇన్ఫోసిస్ కంపెనీలో సిస్టమ్ ఇంజనీర్‌గా ఎస్ శ్రీజ, వైప్రీతి, ఎస్ విశాఖ, బి శివాణి, పి మనస్విని, ఎం శ్రీయ, జుఫీషియన్ కుర్షద్, డి ఆశ్రిత ఉద్యోగాలు సాధించారు. కాగ్నిజెంట్ కంపెనీలో ప్రోగ్రామర్ అనలిస్ట్‌ట్రైనీగా రూ.4 లక్షల ప్యాకేజీతో బి వర్షిత, బి హరిణి, ఎస్ అక్షిత, ఎస్ త్రిష ఉద్యోగాలు సాధించారు. కష్టపడి చదివేతే ఏ ఉద్యోగమైనా సులువుగా సాధించవచ్చు అని అన్నారు. ఇతర విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన 12మంది విద్యార్థులను చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, సెక్రెటరీఅండ్ కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్‌సాయి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి అనిల్‌కుమార్, డీన్ అకాడమిక్ పీకే వైశాలి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## నూతన వధువుకు రూ.10,116 అందజేత

హుజూరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలంలోని మంతెనపల్లి గ్రామానికి చెందిన మంతెన అయిలయ్య కూతురు సుకన్య వివాహం శనివారం జరగగా నాగార్జున డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరి ప్రభాకర్‌రావు రూ.10,116లు అందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ నాగార్జున డెయిరీలో పాలు సరఫరా చేసే పాడిరైతు కుటుంబంలోని ఆడబిడ్డ వివాహం జరిగితే డెయిరీ తరపున పుస్తె, మట్టెలకు బదులుగా రూ. 10,116 అందిస్తున్నామన్నారు. ఇప్పటికి 577మంది ఆడబిడ్డల పెళ్లిలకు మొత్తం రూ. 58,36,932లు అందజేశామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ పుల్లూరి గణేష్‌రావు, ఏజీఎం ఆకునూరి సుధాకర్, శ్రీధర్‌రావు, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.